

# రభస

— మల్లాది మంగతాయారు

అవధానిగారి అబ్బాయి పెళ్ళి నిశ్చయమైంది. ఏడాది, ఏణ్ణార్థంగా నలుగుతున్న సంబంధమే... పిల్లనచ్చినా కట్నం విషయం కొంచెం పట్టింపు రావడంవల్ల కాలయాపనైంది. అదీగాక, అప్పటికింకా పిల్లవాడి చదువూ పూర్తి కానందువల్ల... సరే, మొత్తం మీద వారికీ, వీరికీ వొప్పందం కుదిరేప్పటికి అంత వ్యవధి పట్టింది. ముహూర్తం కూడ పెట్టేశారు.

అసలు అవధానిగారి కొడుక్కి మేనరికం ఉండనే ఉంది... అయితే, అవధానిగారి బావమరది అచ్చయ్యగారున్నాడే ఆయన అసలు సిసలైన కాంగ్రెసువాది. గాంధీ భక్తుడు. ఖద్దరే కడతాడు. ఉన్నతమైన ఆశయాలున్నవాడు. ఆడపిల్లల్ని గూడా బి.ఏ. దాకా తప్పని సరిగా చదివించదల్చినవాడు. కట్నం పుచ్చుకోరాదని, - ఇవ్వరాదని దీక్ష పట్టినవాడు. మరి... అవధానిగారికి ఇవేవీ గిట్టవే... వీటన్నిటికీ వ్యతిరేకమాయె... అందువల్లే ఆయనకు అచ్చయ్యగారి సంబంధం సరిపడలేదు.

పోతే... అవధానిగారి పెద్ద మనుమరాలు అంటే పెద్ద కూతురి కూతురు సుమిత్ర నిక్షేపంలా కొడుక్కి చేసుకోవచ్చు. ఈడైన పిల్లే... చక్కని చుక్కే తగుపాటి చదువూ - సంగీతం వచ్చు. పరాయిగా పోనీకుండా సంబంధం కలుపుకుంటే బాగానే ఉంటుంది. కానీ... వాళ్ళూ కడివెడు పిల్లాజెల్లా ఉన్నవాళ్ళు. ఆస్తి పాస్తులా అంతగా లేవు. అల్లుడు కాకినాడ కాలేజీలో లెక్చరర్ పని చేసుకుంటున్నాడు. అవధానిగారు కోరినంత కట్నం వాళ్ళెక్కణ్ణుంచి తెచ్చి పొయ్యగలరు? ఈయనకున్న ధనదాహం అంతా ఇంతానా? డబ్బు విషయంలో ఆయనది నిర్మొహమాటం... అందుకని ఆ సంబంధాన్ని గురించి తలపెట్టనే లేదు.

మోపెడు ఆస్తి ఉండి,... ఒకరో ఇద్దరో పిల్లలున్న వారితోనే వియ్యమందాలనుకున్నవాడు అవధానిగారు. అందుకు తగ్గట్టు ఈ కలవపూడివారి సంబంధంలో అన్నీ కలిసి వచ్చాయి. వాళ్ళకో కూతురూ... కొడుకు... అంతే.

అవధానిగారికి మాత్రం ఇద్దరు కూతుళ్లు, చివర కొడుకూను... కూతుళ్లకు బోలెడేసి కట్నాలు పోసి పెళ్లి చేశాడు... తప్పదు గదా మరి...,

ఆడపిల్లకి తండ్రి పోలిక, మగపిల్లవాడికి తల్లిపోలిక వస్తే అదృష్టమంటారు గదా! అవధానిగారి పిల్లలు అచ్చం అదే తీరు.

కామాక్షమ్మగారు అంటే అవధానిగారి భార్య ఎంత కళగా ఉంటుందో... లక్షణంగా ఉంటుంది. కానీ, అవధానిగారు మాత్రం పగలు చూస్తే రాత్రి కల్లోకి వచ్చేటట్టుంటాడు. ఆడపిల్లలు ఆయన పోలికే...! అందుకనే పెద్ద పెద్ద కట్నాలివ్వాడంటే... ఇవ్వకేం చేస్తాడు? దైవం రక్షించి వెళ్లిన చోట వాళ్లు సుఖంగా ఉన్నారనుకోండి.

అవధానిగారి కొడుకు రత్నం లాంటివాడు చిన్నప్పుడు ఎంతో అర్భనాకారంగా ఉన్నా పెద్దయ్యాక తేరుకున్నాడు. అబ్బో... చదువులోనూ చిచింద్రీ... ఆ తెలివి తేటలు అమోఘం. ఇంజినీరింగు చదివి ఫస్టుగా పాసయ్యాడు. ఓ లకారం కట్నం పుచ్చుకుందుకు యోగ్యుడయ్యాడు. అంతే కాదు వల్లమాలినంత ఆస్తికి వొక్కడే వారసుడాయె...!

అవధానిగారు లాయరని పేరేగానీ, ఎన్నడూ కోర్టుకి పోయిన జాడాలేదు. పెద్దలు కూడబెట్టి యిచ్చిపోయిన ఆస్తిని... హాయిగా అనుభవిస్తూ కూర్చోడమే... ఆయన ఉద్యోగం. కలుపుగోలుతనంగానీ, మాటపొంకంగానీ, ఆయన్లో కనరాదు వినరాదు. ఎవరికీ చిన్నమెత్తు ఉపకారం చేసే రకం కాదు. ఆ తరహాయే వేరు... పిల్లికి బిచ్చం పెట్టడే.

★ ★ ★

పెళ్లికి పట్టుమని పదిహేన్రోజుల్లేదు. ముహూర్తం దగ్గర పడుతూంది. ఎన్నో పన్లు కావాలి. బోలెడంత బలగం ఉన్నవాళ్లుగదా... కాస్త ముందుగా పిల్చుకోరాదూ... రమ్మని ఉత్తరం ముక్క రాస్తే రెక్కలు కట్టుకు వచ్చి వాలరూ? ఆసరాగా ఉండరా! అమ్మో... అంతమాటే..., ఇంకేమన్నా ఉందీ, పిలుస్తే ముందుగా వచ్చి పడిపోతారేమో, ఎక్కడ తినిపోతారో అని ఆయనకి చెప్పలేనంత భయం. కామాక్షమ్మగారలాకాదు... మంచి భారీ చెయ్యి. పదిమంది రావాలి... కావాలి... అని కూడగట్టుకు వచ్చేరకం.

కావడానికి మొగపెళ్లివారే అయినప్పటికి ఆడపెళ్లి వారంత హడావిడి పడిపోతున్నారు ఆ దంపతులు.

మరి... ఒక్కగానొక్క కొడుకు... ఘనంగా చెయ్యాలని ఉద్దేశం. ఇంటికి సున్నం కొట్టించడం, గడపలకు పసుపు కుంకాలు పెట్టించడం, పందిరి వేయించడం అయింది. రేషను రోజులైనా బ్లాకు మార్కెట్టు బహిరంగంగా తెరిచే ఉంచుతున్నారు. కాబట్టే సరకులకేం కరువులేదు. సమృద్ధిగా కొని పడేశారు. పనివాళ్లని పెట్టి సరకులన్నీ బాగులు చేయించి పోసింది కామాక్షమ్మగారు. ఆవిడ యింకా పూర్వకాలపు మనిషే.. అందుకే అప్పడాలు, ఆవకాయ వగైరాలు దుకాణంలో దొరికినా కూడా... కొనడానికి మొగ్గలేదు. నోటి మంచితనాన ఇరుగు పొరుగుని కూడగట్టుకొని అప్పడాలు వడియాలు, కందిపొడి, దోసావకాయ, తయారు చేయించింది. పసుపు - కారం కొట్టించడం... కావలసిన పిండ్లు పట్టించడం, పిండి వంటలు చేయించడం అన్నీ పూర్తయ్యాయి.

శుభలేఖలు అచ్చయి వచ్చేశాయి. అవధానిగారు పెళ్లికి అయిదురోజుల కర్ధనగా ఆలోచించి అందరికీ పంపించారు.

పెద్దకూతుర్ని అల్లుణ్ణి మాత్రం పెళ్లికి పదిరోజుల ముందుగానే రమ్మని మరీ మరీ చెప్పి రాయించింది కామాక్షమ్మగారు. వస్తే కాస్త చేతిలో పనందుకుంటారు... సుళువుగా ఉంటుందనుకుంటే వాళ్ల అతీగతీయే తెలియలేదు. శుభలేఖ కూడా వెళ్లింది. అయినా... జాడా జవాబు లేకపోలేదు. వీధిలో బండీయో, రిక్షాయో చప్పుడైతే చాలు అమ్మాయి వాళ్లు వచ్చినట్టున్నారంటూ, కామాక్షమ్మగారు చేస్తున్న పని వదిలి పెట్టి వీధి వాకిలి వంక చూడడమే సరిపోతూంది... పాపం.. వాళ్లని రమ్మని ఉత్తరం రాసి వేసినలగాయతు ఆవిడ అదే వరుస. వాళ్లా రానే లేదు.

చిన్న కూతురు వాళ్ళూ గుడివాడకి చేరువనే ఉన్నారు. బందరు - గుడివాడకేమంత దూరమనీ? అయినా వాళ్లు వచ్చేదాకా నమ్మకం లేదు. కారణం ఉందిలెండి... ఆ చిన్నల్లుడు మోటరు సైకిలుకి మనసు పడడం... మామగారు కొనకపోవడం... దాంతో అల్లుడు అలిగి కూర్చోడం... ఎప్పుడో పెళ్లిలో ప్రారంభమైంది... కొనసాగుతూనే ఉంది... ఈ మామగారు అదుగో - ఇదుగో అనడమేగానీ అలక తీర్చనే లేదు. అవధానిగారా... అమ్మో... ఆయనకి డబ్బుకి ప్రాణానికీ లంకె. అల్లుడి సహనం సన్నగిల్లిపోయింది. మూడేళ్లయి బొత్తిగా రాకపోకలే లేవు.

ఈ సందర్భంలోనూ రాకపోతాడేమో, పిల్లదాన్ని పంపక పోతాడేమోనని కామాక్షమ్మగారు గోలపెట్టి, ఆ డబ్బేదో యిచ్చి సమాధానపర్చమని, మొత్తుకుంది... చెవినిల్లుకట్టుకు చెప్పి చెప్పి ఏమైతేనేం అవధానిగార్ని వో క్రమానికి కొంతవరకు వొప్పించి దారికి తెచ్చింది.

అప్పుడాయనగారు చిన్నల్లుడిపేర ఉత్తరం రాశాడు. ఏమనీ... బావమరది పెళ్లికి తప్పకరమ్మని... పాతకోపం మనసులో పెట్టుకోవద్దని, పైకం పంపుతున్నానని, ప్రస్తుతానికి ఏ సెకండు హేండుది దొరికినా కొనుక్కోమని, తర్వాత కావ

లిస్తే సరికొత్తది కొనుక్కోవచ్చని, ఇంటికి మందుల షాపుకి అట్టే దూరం లేదు కాబట్టి అది వాళ్లే మ్మని.... (చిన్నల్లుడికి సొంత మందుల షాపు ఉందిలెండి) అయినా ఇనప ముక్క-కోసం అంత సొమ్ము ఖర్చుపెట్టడం తనకు సుతరామూ ఇష్టం లేదని, వివరంగా ఉత్తరం రాసి, రెండున్నర వేలకి వో చెక్కు, శుభలేఖ అన్నీ ఏకంగా జమ చేసి పంపుతూ, పైన పైకం పడితే వీలునుబట్టి తరువాత పంపుతానని మరీ తెలియజేశాడు.

ఎట్టకేలకు... చిన్నల్లుడు... తాత్కాలికంగా సమాధానపడడం జరిగింది. మామగారి మాటకు పీలైనంత విలువ యిచ్చి, పెళ్లినాటికి తప్పక వస్తా మని తిరుగుటపాలో ఉత్తరం రాసి పడేశాడు. కామాక్షమ్మగారి మనసు కుదుట బడింది, అవధానిగారి మాటెలా ఉన్నా......

కూతుళ్లిద్దరికి ఒకే రకం కంచి పట్టుచీరెలు కొని ఉంచింది. కోడలికి పెట్టే సొమ్ము— రెండు పేటల పలకసరులు, రవ్వల దుద్దులు, రెండు జతల గాజులు, వో జత రాళ్ల గాజులు, రవ్వల ఉంగరం వగైరాలన్నీ ఎప్పుడో చేయించి ఉంచారాయె... ఆపైన వచ్చే బంధుమిత్రుల పెట్టుబడులకని, చీరెలు రెవికలు పంచెల చాపులు, ఉత్తరీయాలు మొదలైనవన్నీ వారి వారి అంతస్తుని దృష్టినుంచు కుని కొని, చీట్లు రాసి పెట్టేశారు. అత్త ఆడపడ చుల లాంఛనాలన్నీ యథావిధిగా ఘనంగా జరిపిం చాలని వియ్యాలవారితో ముందే వొప్పందం జరిపిం చింది కామాక్షమ్మగారు.

పెళ్లికి ఎక్కడెక్కడి బంధువులు వచ్చేశారు. రారేమో అనుకున్న చిన్నల్లుడూ కూతురూ వచ్చారు.

తమ పిల్లని చేసుకోలేదనే కించ పెట్టుకోకుండా అవధానిగారి బావమరది అచ్చయ్యగారు సకుటుం బంగా వచ్చేశాడు. అంతా వచ్చినట్టే... ఎటొచ్చీ రానిదల్లా ఒక్క కాకినాడ వారే... అదే పెద్ద కూతురూ వాళ్లూనూ.

రాకపోరు... పెళ్లికొడుకును చేసే వేళకైనా వచ్చి తీరుతారని గంపెడాశ పెట్టుకుంది కామాక్షమ్మ గారు.

రాని కారణమేమిటో చెబుతూ ఒక్క కార్డు ముక్కయినా రాయకపోయారే... అని కస్సుమ న్నాడు అవధానిగారు.

ఇంకా పెద్దమ్మాయివాళ్లూ రాలేదే... ఒక్కగా నొక్క తమ్ముడే... రావద్దూ... అంటూ ఆరా తియ్యాలనే తలంపుతో బంధువుల పలకరింపులు.

అవధానిగారు కామాక్షమ్మగారు సర్ది సమాధా నాలు చెప్పలేక సతమతమై పోయారు.

ఎవరొచ్చినా - రాకపోయినా కాలం ఆగదు. వస్తూ ఆగవు. పెళ్లికొడుకును చేసే వేడుక చేశారు.. ఆ తర్వాత స్నాతకం కానిచ్చుకున్నారు.. రెండు బస్సుల్లో పెళ్లివారు కలవపూడి తరలి వెళ్లారు.

పెద్దకూతురూ వాళ్లు పెళ్లి వేళకైనా ఊడిపడతా రేమోనని ఆశపెట్టుకున్నారు... ఉహూ... రానే లేదు.

ఎప్పటికప్పుడు గుడివాడ వస్తూ పోతూ ఉండే వాళ్లు... తీరా సమయానికి అక్కర పట్ల రాకపోయే సరికి అవధానిగారికే ఎక్కడలేనంత అక్కసు వచ్చిం ది. కామాక్షమ్మగారూ ఎంతో నొచ్చుకుంది.

''ఫలానా కారణం చేత రావీలు పడదని తెలియ జేస్తే పుట్టిమునుగుతుందాయే? వాళ్ని కట్నకాను కలేం తెమ్మన లేదుగా రావాలని దానికి తెలీదా... అతనికి తెలీదా? మళ్లీ బయట ఉద్యోగాలు చేసి, శ్రీ రంగ నీతులు చెప్తారే! ఈ సారి వచ్చారో నా గడపలో కాలుపెట్టనీయను. ఈ నాటితో వాళ్లకీ మాకూ ఏ సంబంధం లేదు...'' అంటూ విడిదిలో అవధానిగారు గొంతుచించుకున్నారు.

''తమ పిల్లని చేసుకోలేదనే కోపంతో పెళ్లికి వెళ్లేందుకు వల్లకాదని అల్లుడు అడ్డుపడ్డాడేమో లెండి...అదీ నా అంత అమాయకురాలు... ఏం చేస్తుందీ... ఆడపిల్ల... దాని పెత్తనమా... ఏమిటీ...'' అంటూ కామాక్షమ్మగారు సన్నాయి నొక్కులు నొక్కింది.

''అదంతా నాకనవసరం... తరుణానికి రాని వాళ్లు లేనివాళ్లల్లోనే జమ...'' అంటూ ఆవేశంగా అవధానిగారి ఝూడింపులు... బంధువులు కూడా అవధానిగారి శ్రుతిలో శ్రుతి కలిపారు... ఆ కాకి నాడ వారికి తలో నాలుగు అక్షింతలూ వాళ్లు వేశారు.

★ ★ ★

అనుకున్న ప్రకారం పెళ్లి ఘనంగా జరిగింది. గుడివాడ స్వగృహంలో... గృహప్రవేశం... సత్యనా రాయణ వ్రతం అన్నీ ముగిశాక పెళ్లికి వచ్చిన చుట్టాలంతా ఎవరిదోవనువారు చక్కాపోయారు.

వారమైంది... అవధానిగారూ కామాక్షమ్మ గారూ ఇంకా పెళ్లిబడలిక నుంచీ తేరుకోలేదు.

అవధానిగారు పడక్కుర్చీలో పడుకుని, కళ్లు మూసుకుని, అయిన ఖర్చుకి మనసులో పద్దు వేసుకుంటున్నాడు. అంతలో పోస్టుమాను వో ఉత్త రం రాల్చిపోయాడు.

ఆ హఠాన అవధానిగారు కళ్లజోడు తగిలించు కుని కవరు మీదున్న దస్తూరిని గుర్తుపట్టి ఒక్క మూలుగు మూలిగాడు. ''ఉత్తరమా...? ఎక్క ణ్ణుంచీ...? ఎవరు రాశారూ?...'' అంటూ కామా క్షమ్మగారు గొణుగుతున్నట్టు అడిగింది.

''ఇంకెవరూ... కాకినాడ పెద్ద మనిషి...''

''అబ్బ... కవరు చింపి... ఏం రాశారో చద వండి... తర్వాత కసురుకోవచ్చు.''

''ఏమన్నా అఘోరించనీ...'' అని సణు క్కుంటూ అవధానిగారు కవరు పర్రున చింపి, రుసరుసలాడుతూ ఉత్తరం చదవడం మొదలె ట్టాడు.

బ్రహ్మశ్రీ వేదమూర్తులైన మామగారికి నమ స్కారములు. మర్యాదమండినట్టే ఉంది... అని పళ్లు పటపటలాడిస్తూ,

చిరంజీవి కుమార్ పెళ్లికి రమ్మని రాసిన ఉత్త రం. పంపిన శుభలేఖ మాకు ఇప్పుడే అందాయి... మీరు అడ్రసులో శ్రీనివాసమూర్తి అని రాయక, ఎస్వీ మూర్తి అని రాయడంవల్ల అవి మా వీధిలోనే ఉన్న మరో లెక్చరరు శ్రీవరాహమూర్తి అయన్నే ఎస్వీ అంటారు... అక్కడికి వెళ్లాయి. వాళ్లు ఇరవై రోజులుగా ఊర్లో లేరు. ఇవాళే వచ్చారు... వస్తూనే తెచ్చియిచ్చారు... అదీ సంగతి... ఇలా జరిగినం దుకు ఎంతో విచారపడుతున్నాం. మీ అమ్మాయైతే చెప్పనే అక్కర్లేదు. మేము రానందుకు మీరూ ఎంతగా... అనుకుని ఉంటారో ఊహించగలను.

''చూశారా... మీ వల్లనే యింత జరిగింది. పాపం వాళ్లని ఏమేమో అనుకున్నాం...''

''ఇలా ఒకే పేరుగల శుంఠలు ఆ వీధిలో ఇద్దరే డ్చారని నాకేం తెలుసే...'' అంటూ అవధానిగారో రంకె వేశాడు.

''ఊ... తర్వాతేం రాశాడో చదవండీ...''

ఇక్కడంతా క్షేమం... మీ అమ్మాయి మరదల్ని చూడాలని ఆరాటపడిపోతూంది... త్వరలో వస్తాం... అఘోరించినట్టే ఉంది...

ఇట్లు,

శ్రీ.మూ. హా.వీడిబొంద

''ఉష్.., అంతమాటనకండి...''

ఉత్తరమంతా చదివి అవధానిగారు వో క్రమానికి రవంత శాంతపడి, కామాక్షమ్మగారి వంక చూసి, ''మూర్తి ఇదో నాటకం ఆడడం లేదు కదా...!'' అన్నాడు.

''అయ్యో... ఎంతమాట... విషయం కనబడు తూంది గదా... ఇంకా అనుమానమేనా... అతడూ యోగ్యుడండి...

అలాంటి వాడు కాదు...'' అని వక్కాణించింది కామాక్షమ్మగారు.

''నేను... యోగ్యుడు కనకే... ఎందుకొచ్చింది గానీ... ఇంతకూ....''

''ఆ పేరేదో పూర్తిగా రాస్తే ఇంత రభసయ్యేదా చెప్పండి. అదెక్కడి గ్రహచారమో... తావులకి తావులు ఉత్తరాలు రాస్తారు... పేరు దగ్గరికొచ్చేస రికి అంత బద్ధకమేమిటట... మీ పేరూ పూర్తిగా రాయగా నేనెన్నడూ చూడలా... పెద్దవాళ్లు ముచ్చటబడి ''వేలు పోసి బారసాల చేసి.. రామావ ధాని అని పేరుపెడితే— ఏవిటో ఆర్యే ధాని అని రాస్తారాయె.

''ఎదుట వాళ్ల పేర్లూ తుంపులు చేసి తుంచి ముక్కలు చేసి రాస్తారాయె... ఏం మనిషో ఏం లోకమో...! పోన్లెండి... అయిందాన్ని గురించి ఇప్పుడనుకునేం లాభంగానీ,... అల్లుడికి సమాధా నం రాయండి... త్వరలో తిరుపతి ప్రయాణం ఉంది కాబట్టి... కొడుకు, కోడల్ని పెళ్లయిన నెల్లోపలే స్వామి దర్శనానికి తీసుకువెళదామనుకు న్నాం గదా... అంతా వస్తే కుటుంబయాత్ర చేసిన ట్టవుతుంది...'' అంటూ కామాక్షమ్మగారు చెప్ప డమే తరువాయిగా అవధానిగారు ఉత్తరం రాయడ మేమిటీ... పూర్తి పేరుతో సంతకం చేసి... చిరున వ్వుతో కామాక్షమ్మగారికి చూపించారు.

''హమ్మయ్యా.... మన అల్లుడు మామగారికే పాఠం నేర్పాడండీ'' అని ఫక్కున నవ్వింది కామాక్ష మ్మగారు. అంత వరకు వేడివేసవిలా నిప్పుల చెరుగు తున్న ఎండ వచ్చున తెర తీసింది... అట్టే చల్లని వానగాలి వీచింది. ◘